nipuna
Every Wednesday Free Supplement
05.
28 ఫిబ్రవరి 2024
పేజీలు 8

### స్లిమ్

చంద్రుడిపై పరిశోధనలకు జపాన్ ప్రయోగించిన 'స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్ (ఎస్ఎల్ఐఎం-స్లిమ్) జనవరి 19న చంద్రుడి ఉపరితలంపై దిగింది. 'పిన్‌పాయింట్ టెక్నాలజీ' ఉపయోగించి చంద్రుడి మధ్య రేఖకు దక్షిణంగా సమీపంలోని ఒక బిలం వాలుపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసింది. దీంతో ఈ ఘనత సాధించిన ఐదో దేశంగా జపాన్ నిలిచింది. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన దేశాల జాబితాలో సోవియట్ యూనియన్, అమెరికా, చైనా, భారత్ ఉన్నాయి.

4వ పేజీ తరువాయి

## 7) భారతదేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం

- ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక చరిత్రను వారసత్వ, సాంస్కృతిక అంశాల కోణంలో సమన్వయం చేసుకుంటూ చదవాలి. దీనికోసం ప్రామాణిక పుస్తకాలు, పాఠ్యపుస్తకాల (టెక్ట్స్‌బుక్స్)ను ఎంచుకోవాలి.
- వివిధ కట్టడాలు, ప్రాచీన శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, చారిత్రక గ్రంథాలు, విదేశీ పర్యాటకుల రచనల గురించి, వారు సందర్శించిన రాజుల ఆస్థానాలు, వారి సమకాలిక రాజ్యాలు, వారి రచనల్లోని సామాజిక అంశాలను చదవాలి. శాసనాలు, మత పరిస్థితులు, పునరుజ్జీవ ఉద్యమాలు, మత సంస్కరణోద్యమాలు, సామాజిక సంస్కర్తలు, సంస్కరణోద్యమాలు, భారత స్వాతంత్ర్య ఉద్యమ అంశాలు, పత్రికలు, వివిధ ఉద్యమాలు, ప్రముఖ సంఘటనలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఇటీవల ప్రారంభించిన హెరిటేజ్, ఆధ్యాత్మిక కారిడార్లు, వార్తల్లో నిలిచిన ఆధ్యాత్మిక ప్రాంతాలు, ప్రధాని పర్యటించిన ప్రముఖ దేవాలయ వాస్తు, శిల్ప విశేషాలతో పాటు ఆయా ప్రాంతాల్లో జరిగే విశేష ఉత్సవాలు, జాతర్లపై అధ్యయనం చేయాలి. అలాగే వార్తల్లోని ఆధ్యాత్మిక ప్రదేశాలపై వివాదాస్పద అంశాల నేపథ్యంలో ప్రశ్నలు రావచ్చు. ఉదాహరణకు రాహుల్‌గాంధీ అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం రోజు అసోంలోని బతద్రవ ఆధ్యాత్మిక ప్రాంతాన్ని సందర్శించడానికి వెళ్లినప్పుడు, అసోం ప్రభుత్వం అనుమతించకపోవడం నేపథ్యంలో ఆ ప్రదేశ వైశిష్ట్యంపై దృష్టి సారించాలి.

## 8) భారత రాజ్యాంగం, పాలిటీ

- రాజ్యాంగ రచన విశేషాలు, రాజ్యాంగంలోని వివిధ విభాగాలు, వాటిలోని అంశాలు, ముఖ్యమైన ప్రకరణలు, ఉప ప్రకరణలను క్షుణ్ణంగా చదవాలి. ప్రవేశిక ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలు, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, రాష్ట్రపతి, గవర్నర్, బడ్జెట్, అత్యవసర పరిస్థితులు, రాజ్యాంగ సవరణ, ఎన్నికలు, స్థానిక పాలన, వివిధ రాజ్యాంగబద్ధ/ చట్టబద్ధ సంస్థలు, న్యాయ వ్యవస్థ, న్యాయ సమీక్ష, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, కమిటీలు, చట్ట నిర్మాణ ప్రక్రియ వంటి అంశాలపై ప్రకరణలను సునిశితంగా నేర్చుకోవాలి.
- అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలు, శాసన సభ్యుల ప్రత్యేకాధికారాలు (ప్రివిలేజెస్), పార్టీ ఫిరాయింపులు, ఎన్నిక విధానాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలు, సమకాలీన అంశాలు, వివాదాల నేపథ్యంలో గమనించాలి. వివాదాస్పద బిల్లులు, గవర్నర్, స్పీకర్ వంటి అధిపతుల నిర్ణయాల నేపథ్యంలో ఆయా విషయ సంబంధిత ప్రకరణలు ప్రాధాన్యం సంతరించుకుంటాయి. ఉదాహరణకు నోటుకు ప్రశ్న అంశంలో ఇటీవల బహిష్కరణకు గురైన ఎంపీ మహువా మొయిత్రా ఉదంతం నేపథ్యంలో శాసన సభ్యుల తొలగింపు విధానాలు వంటి వాటిపై దృష్టి సారించాలి. అదేవిధంగా చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం, న్యాయ సంహిత బిల్లుల వంటి ఇతర బిల్లుల ఆమోదం నేపథ్యంలో వాటిలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. స్థూలంగా ప్రతి పరిపాలన, రాజకీయ అంశాలను రాజ్యాంగ ప్రకరణల కోణంలో పరిశీలించడం ద్వారా ప్రశ్నలను అంచనా వేయవచ్చు.

## 9) గవర్నెన్స్ అండ్ పబ్లిక్ పాలసీ

- దేశ పాలనలో తీసుకువచ్చిన సరికొత్త మార్పులు, ప్రవేశ పెట్టిన సాంకేతిక విధానాలు, వివిధ అంశాల పరంగా ఏర్పరిచిన పాలసీలు, పాలనలో ప్రజల భాగస్వామ్యం వంటి విషయాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. రియల్ టైమ్ గవర్నెన్స్, ఈ-గవర్నెన్స్, డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్స్, ఆధార్ అనుసంధానత, వివిధ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక యంత్రాంగం గురించి తెలుసుకోవాలి. గవర్నెన్స్, పబ్లిక్ పాలసీలకు సంబంధించిన వివిధ కమిటీలు, వాటి సిఫారసులను చదవాలి. గవర్నెన్స్, పబ్లిక్ పాలసీలపై వివిధ సదస్సులు, అవార్డులు, ఒప్పందాలపై దృష్టి సారించాలి.
- ఉదాహరణకు గత ప్రిలిమ్స్‌లో 'ఆడిట్' పరంగా అంతర్జాతీయ అవార్డు పొందిన ఆన్‌లైన్ గవర్నెన్స్ వేదికకు సంబంధించి ప్రశ్న వచ్చింది.

## 10) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు

- రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ప్రారంభించిన నూతన పథకాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. పథకాల వివరాలు, లబ్ధిదారులు, అర్హతలు, అనర్హతలు, పథకం ప్రారంభ తేదీ, ప్రాంతం, సంబంధిత ప్రాధికార సంస్థ, పథక వ్యయం, బడ్జెట్ కేటాయింపులపై క్షుణ్ణమైన అవగాహన ఉండాలి.
- అదేవిధంగా కొత్త ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నివేదికలు, ప్రారంభించిన కొత్త విధానాలపై దృష్టి సారించాలి. చేయూత, మహాలక్ష్మి, ప్రజాపాలన, ప్రజావాణి తదితర కార్యక్రమాలపై అధ్యయనం చేయాలి.

## 11) తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు, సాహిత్యం

- తెలంగాణకు ఒక ప్రత్యేక మిశ్రమ సంస్కృతితో పాటు స్థానిక సాంస్కృతిక నేపథ్యం ఎంతో సుసంపన్నంగా ఉంది. సమాజంలో అనాది నుంచి వివిధ జాతులు, వర్గాలు, మతాలు, అంతర్భాగంగా ఒక విశిష్ట సహజీవన సౌందర్యాన్ని చాటిచెబుతున్నాయి. ఈ సాంస్కృతిక అంశాలతో పాటు ఈ ప్రాంతంలోని వివిధ పాలనా యుగాల్లో విలసిల్లిన ప్రదేశాలు, కట్టడాలు, నిర్మాణ రీతులు, వాస్తు, శిల్ప వైశిష్ట్యం తెలుసుకోవాలి.
- అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాట సమయంలో జరిగిన ప్రముఖ సంఘటనలు, వెలువడిన సాహిత్యం, వార్తాపత్రికలు, సంబంధిత అంశాలను గమనించాలి. సంఘ సంస్కరణ ఉద్యమాలు, గ్రంథాలయ, భూదాన ఉద్యమాలు, రైతాంగ, గిరిజన ఉద్యమాలపై కూడా దృష్టి సారించాలి.
- తెలంగాణకు ప్రత్యేకమైన వివిధ ఉత్సవాలు, జాతరలు, పండుగలు, ఆహారం, కళలు, కళాకారులు, సాహిత్యం వంటి అంశాలను భౌగోళికత, జాతులపరమైన స్పృహతో అధ్యయనం చేయాలి. తెలంగాణతో సంబంధం ఉన్న చలనచిత్రాలు, దర్శకుల గురించి కూడా గత పరీక్షల్లో అడిగారు.
- తెలంగాణలోని ప్రముఖ ఆలయాల వాస్తు, శిల్ప కళారీతులు, కోటలు, పుణ్యక్షేత్రాల అభివృద్ధి, యునెస్కో గుర్తింపు, భౌగోళిక గుర్తింపు పొందిన అంశాలు, జానపద కళారీతులు, పద్మ అవార్డులు, జ్ఞానపీఠ్, కేంద్ర సాహిత్య అకాడమీ, భారతరత్న వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందిన ప్రముఖులు, సాహితీవేత్తలు, కళారీతులు, వారి సేవలపై అవగాహన ఉండాలి.
- గతంలో బతుకమ్మ పండుగ, నాగోబా జాతర, మేడారం జాతర వంటి అంశాలతో పాటు వాటికి సంబంధించిన ఆచారపరమైన, భౌగోళికపరమైన, జాతులపరమైన ప్రశ్నలు వచ్చాయి.
- వివిధ పరిపాలనా కాలాల్లో నగదు/ మారకం, వాణిజ్యం, ఆచారపరమైన పదజాలానికి సంబంధించిన ప్రశ్నలు గతంలో వచ్చాయి. ఈ విభాగం అధ్యయనానికి తెలుగు అకాడమీ ప్రచురించిన ప్రత్యేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

## 12) సామాజిక ఎడబాటు (సోషల్ ఎక్స్‌క్లూజన్), లింగ, జాతి, కుల, వైకల్య సంబంధిత హక్కుల పరమైన అంశాలు, సమ్మిళిత విధానాలు (ఇన్‌క్లూజివ్ పాలసీస్)

- వివక్ష, సామాజిక దురాచారాలు, వాటి నివారణకు తీసుకున్న చర్యలు, చట్టాలు, శిక్షలు వంటి అంశాలతో పాటు, అసమానతలకు గురవుతున్న వివిధ వర్గాల హక్కులకు సంబంధించిన ఉద్యమాలు, కమిటీలు, చట్ట సవరణలు, ప్రత్యేక ఏర్పాట్లు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- ఈ విభాగంలో ఎక్కువగా ఆయా అంశాలపరంగా చేసిన చట్టాల్లోని విషయాలు, నిర్వచనాలు, ప్రాధికార సంస్థల కోణంలో ప్రశ్నలు అడుగుతున్నారు.
- ఉదాహరణకు గత ప్రశ్నపత్రంలో 'ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం'ను తీసుకొచ్చిన సందర్భంగా, ఆ చట్టం ప్రకారం ట్రాన్స్‌జెండర్లుగా ఎవరిని పరిగణిస్తున్నారు అనే అంశంపై చట్ట నిర్వచనానికి సంబంధించి ప్రశ్న అడిగారు. అదేవిధంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణా చట్టం ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో, ఎన్ని రోజుల్లో, మహిళలు ఎవరెవరికి, ఏ విధంగా ఫిర్యాదు చేయవచ్చన్న అంశంపై కూడా విపులంగా ప్రశ్న అడిగారు. వివిధ శారీరక వైకల్యాలను ఎదుర్కొంటున్న వ్యక్తులకు సంబంధించి సహకారం అందిస్తున్న ప్రాధికార సంస్థలను అవి ఉన్న ప్రదేశాలతో జతపరచమని ప్రశ్న వచ్చింది. ఈ విధంగా ప్రశ్నల సరళిని పసిగట్టి అభ్యర్థులు ఈ విభాగానికి సన్నద్ధం కావాలి. దీని కోసం సంబంధిత చట్టాలు, చట్ట సవరణలు, నివేదికలు, పరిరక్షణ సంస్థలపై ఎప్పటికప్పుడు వార్తాపత్రికల నుంచి సమాచారం సేకరించాలి.

## 13) లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్

- ఈ విభాగంలో గ్రాఫ్‌లు, పైచార్టులు, బార్ గ్రాఫ్‌లు, పట్టికల రూపంలోని సమాచారాన్ని విశ్లేషించి సమాధానాన్ని కనుక్కునేలా ప్రశ్నలు అడగటంతో పాటు రక్తసంబంధాలు, దిక్కులు, గడియారం, క్యాలండర్, పాచికలు, కోడ్‌భాషను కనుగొనడం, సీటింగ్ అరెంజ్‌మెంట్స్, స్టేట్‌మెంట్స్ అండ్ అజంప్షన్స్, స్టేట్‌మెంట్స్ అండ్ కన్‌క్లూజన్స్, నంబర్, లెటర్ సిరీస్ పై ప్రశ్నలు ఉంటాయి. ఈ అంశాలకు సంబంధించి ప్రామాణిక పుస్తకాలతో రోజూ కొంత సమయం ప్రాక్టీస్ చేస్తే అధిక మార్కులు పొందే అవకాశం ఉంది.

# ఉన్నత విద్య కోసం మరో ఆరు దేశాలకు భారత విద్యార్థులు

**ఉన్నత చదువుల కోసం అమెరికా, కెనడా వెళ్లడం ఆనవాయితీ. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులకు అనేక ఆప్షన్లు ఉన్నాయి. కొందరు జర్మనీలో ఇంజినీరింగ్, రోటర్‌డామ్‌లో ఎంబీఏ, మరికొందరు హంగేరీలో ఎకనామిక్స్ లేదా న్యూజిలాండ్‌లో క్రియేటివ్ ఆర్ట్స్‌ను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం విదేశాల్లో 13.2 లక్షల మంది భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వీరిలో 4.6 లక్షల మంది అమెరికాలో, 1.83 లక్షల మంది కెనడాలో ఉన్నారని ప్రపంచ బ్యాంకు డేటా చెబుతోంది.**

- ఇటీవలి కాలంలో అమెరికాలో భారతీయ విద్యార్థులపై దాడులు పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ తేలికపాటి మాంద్యం నుంచి కోలుకోవడానికి యూకే ఆర్థిక వ్యవస్థ ఇంకా కష్టపడుతున్నది. అమెరికా, యూకే, కెనడా వంటి సంప్రదాయ అధ్యయన గమ్యస్థానాలను భారతీయ విద్యార్థులు పునఃసమీక్షించాల్సిన సమయం ఇది.

### జర్మనీ

- జర్మనీలో మొత్తం 423 ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో 108 విశ్వవిద్యాలయాలు, 211 అప్లైడ్ సైన్సెస్ విశ్వవిద్యాలయాలు, 52 కళలు, సంగీత కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి 42,997 మంది విద్యార్థులు జర్మనీలో విద్యనభ్యసిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థుల్లో ప్రాచుర్యం పొందిన కోర్సులు ఇంజినీరింగ్, లా మేనేజ్‌మెంట్, గణితం. జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్ డేటా ప్రకారం, జర్మనీలో భారతీయ విద్యార్థుల సంఖ్య గత ఐదేళ్లలో రెట్టింపు అయింది. ఇది జర్మన్ క్యాంపస్‌లలో అతిపెద్ద అంతర్జాతీయ సమాజంగా మారింది.

### నెదర్లాండ్స్

- నెదర్లాండ్స్‌లో 30 కంటే ఎక్కువ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉన్నాయి. వాటిలో ఎక్కువ భాగం ఆమ్‌స్టర్‌డామ్, రోటర్‌డామ్, గ్రోనింగెన్, డెల్ఫ్ట్‌లలో ఉన్నాయి. నెదర్లాండ్స్‌లోని భారత రాయబార కార్యాలయం లెక్కల ప్రకారం ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో 3,500 మందికి పైగా భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో 1,15,000 మంది అంతర్జాతీయ విద్యార్థులు ఉన్నారు. ఇది 2005 నాటికి దేశంలో ఉన్న సంఖ్యకు 3.5 రెట్లు. విశ్వవిద్యాలయాల్లో మొదటి సంవత్సరం విద్యార్థుల్లో సుమారు 40 శాతం మంది ప్రస్తుతం నెదర్లాండ్స్ వెలుపల నుంచి వస్తున్నారు.

### పోలాండ్

- పోలాండ్‌లో దాదాపు 457 విశ్వవిద్యాలయాలు, కళాశాల స్థాయి ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. పోలాండ్‌లో టర్కీ విద్యార్థుల తరువాత రెండో స్థానంలో సుమారు 2,500 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.



### హంగేరి

- హంగేరీలో మొత్తం 65 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో అనేకం బుడాపెస్ట్ కేంద్రంగా ఉన్నాయి. వీటిలో బుడాపెస్ట్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎకనామిక్స్, సెంట్రల్ యూరోపియన్ యూనివర్సిటీ, ఈఎస్ ఎస్సీపి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) విడుదల చేసిన 2022 గణాంకాల ప్రకారం హంగేరియన్ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1,000 మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారు.

### బెల్జియం

- బెల్జియం ఐరోపాలోని కొన్ని పురాతన, అత్యంత ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలను కలిగి ఉంది. ముఖ్యంగా కాథోలిక్ యూనివర్సిటీ ఆఫ్ ల్యూవెన్, యూనివర్సిటీ ఆఫ్ ఘెంట్, యూనివర్సిటీ లిబ్రే డి బ్రూక్సెల్స్, వ్రిజే యూనివర్సిటీ బ్రసెల్, బ్రస్సెల్స్, ఆంట్వెర్ప్ విశ్వవిద్యాలయం ఉన్నాయి. ఎక్కువ మంది భారతీయ విద్యార్థులు బెల్జియంలో ఉండగా, కొందరు లక్సెంబర్గ్‌లో కూడా ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం బెల్జియంలో 24,732 మంది ప్రవాస భారతీయులు ఉన్నారు.

### న్యూజిలాండ్

- న్యూజిలాండ్‌లో ఎనిమిది విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఆక్లాండ్ విశ్వవిద్యాలయం అత్యున్నత ర్యాంక్ పొందిన ప్రపంచ విశ్వవిద్యాలయం. చాలా మంది భారతీయ విద్యార్థులు ఎంబీఏ చేయడానికి లేదా అకడమిక్ రీసెర్చ్ కోసం న్యూజిలాండ్ వెళతారు. చైనా తర్వాత రెండో స్థానంలో ఉన్న ఈ ద్వీపదేశంలో దాదాపు 15,000 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.

స్వామి ఆర్వీయస్